క్లుప్తంగా

ప్రభుత్వ భూములను కాపాడే బాధ్యత వీఆర్వోలదే



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కనకారావు

నాతవరం: గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా కాపాడే బాధ్యత వీఆర్వోలదే అని తహసీల్దార్ పి. కనకారావు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇప్పటికే మండలంలో పలు గ్రామాల్లో ఆక్రమణలకు గురైన భూములను ఖాళీ చేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. కొందరు వీఆర్వోలు ఆక్రమణదారులను ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం ఉందని, వారిలో మార్పు రాకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. సరిహద్దు రాళ్ల యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, ఆర్ఐ నారాయణరావు, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, సర్వేయర్లు విజయకుమార్, జగదీష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

శివాలయం వద్ద అన్నసమారాధన



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

కె.కోటపాడు : ఎ.కోడూరు భ్రమరాంబికా సహిత మల్లిఖార్జునస్వామి ఆలయం వద్ద సోమవారం పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిపారు. సూర్రెడ్డిపాలెం, పాడుగుపాలెం, ఎ.భీమవరం, కొత్తఅగ్రహారం తదితర గ్రామాల నుండి సుమారు 2 వేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. స్టేషన్ సిబ్బందిని ఎస్ఐ బి.రామకృష్ణ అభినందించారు.

ఆనందపురంలో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు



పరీక్ష చేస్తున్న వైద్యాధికారిణి శైలజ

కె.కోటపాడు : వేసవిలో వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శైలజ అన్నారు. ఆనందపురంలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషియన్‌లో భాగంగా గర్భిణులకు తనిఖీలు నిర్వహించి 119 మందికి మందులు అందించారు. ఆరుగురి ఇళ్లకు వెళ్ళి పరీక్షలు చేశారు. కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ వంటాకు అప్పాజి పర్యవేక్షించారు. హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

30 నుంచి మెగా క్రికెట్ టోర్నమెంట్

రావికమతం: కొత్తకోట గ్రాండ్ బాయ్స్ యూత్ అసోషియేషన్ పేరిట ఏటా మాదిరి ఈ ఏడాదీ వేసవి మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఈ నెల 30 నుంచి నిర్వహిస్తున్నారు. స్థానిక హైస్కూల్ ఆవరణలో జరిగే ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ స్థానానికి విజేతలను ఎంపిక చేసి రూ.20,000, రూ.15,000, రూ.10,000, రూ.6 వేలు చొప్పున నగదు బహుమతితో పాటు ట్రోఫీ, సర్టిఫికెట్లు అందించనున్నారు. మ్యాన్‌ఆఫ్‌ది సిరీస్‌కు రూ. 2వేలు, బెస్ట్ బ్యాట్స్‌మేన్‌కు, బౌలర్‌కు రూ.1,500, బెస్ట్ కెప్టెన్‌కు రూ.1,500 చొప్పున ఇవ్వనున్నట్టు నిర్వాహక కమిటీ సభ్యులు బాబి, దొర, రవి, గోవింద తెలిపారు. వివరాలకు 97036 72021, 98491 46860 నంబర్లలో సంప్రదించాలన్నారు.

చెరువును అభివృద్ధి చేయాలని వినతి

మాకవరపాలెం: మండల కేంద్రంలోని కంచెవాని చెరువులో ఉపాధి పనులు చేపట్టాలని రైతులు స్పందనలో విన్నవించారు. ఈ చెరువులో పూడిక పేరుకుపోయి, తుప్పలతో దర్శనమిస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం చెరువును అభివృద్ధి చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించామని రైతులు చింతా శర్మ, సంతోష్, అంకంరెడ్డి రాంబాబు తెలిపారు.

పాలనాదక్షుడు సీఎం జగన్



గాంధీగ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ



సాగరంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

మాడుగుల: పార్టీలకు అతీతంగా ప్రజారంజక పాలన అందిస్తున్న సంక్షేమ సారథిగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోతారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని సాగరం పంచాయతీలో సాగరం కాలనీ, సాగరం, సురవరం, ఒడపాడు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. మహిళలు హారతులు పట్టి జై జగన్ అంటూ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు ఘనస్వాగతం పలికారు. ఎటువంటి ఆధారం లేని దుద్దు కృష్ణకు సొంత నిధుల రూ. 3 వేల నగదు అందజేశారు. సాగరం గ్రామానికి ఇంటింటికీ కుళాయిలు పథకానికి రూ. 78 లక్షలు మంజూరు చేశారు. సిరిపురం వరలక్ష్మి భర్త మృతి చెందడంతో ఆమె పాప 4వ తరగతికి రాగానే రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించడానికి హామీ ఇచ్చారు. పాడి రైతులకు కళ్లాల వద్ద రెండు తాగునీటి బోర్లు మంజూరు చేశారు. గ్రామానికి చెందిన నిరుపేద మజ్జి సోమునాయుడికి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేశారు. అనపర్తి శ్యామల జగనన్న ఇల్లు నిర్మించకోవడంతో ఉచితంగా విద్యుత్ మీటరు అందజేశారు. జీవనం సాగించుకోలేని నిరుపేద మహిళ కోట్ని కొండమ్మకు రూ. 3 వేల నగదు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రం శిథిలమవడంతో కొత్త భవనానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఐసీడీఎస్ పీవో శ్రీదేవికి ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇద్దరు చిన్నారుల ముక్కు తుడిచి మానవత్వం చాటుకున్నారు. గ్రామానికి ఉరకగెడ్డ కాలువ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరగా కాలువ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సచివాలయ భవనం ప్రారంభం

సాగరం కాలనీలో రూ. 40 లక్షలతో నిర్మాణం పూర్తయిన సచివాలయ భవనాన్ని బూడి ప్రారంభించారు. సురవరంలో నాడునేడులో రూ. 25 లక్షలతో నిర్మాణం చేపట్టిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. సురవరం గ్రామానికి రూ. 52 లక్షలతో ఇంటింటికీ కుళాలకు నిధులు మంజూరు చేశారు. జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ కోట్ని జయమ్మ, ఎంపీటీసీ శ్రీనాదు సూర్యకాంతం, మార్కెట్ కమిటీ చైర్మన్ శేనాపతి కొండలరావు, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి, పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీగ్రామంలో..

చోడవరం: అర్హతే కొలమానంగా అందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గాంధీగ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం రెండో రోజు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల మంజూరుపై ఆరా తీశారు. గ్రామంలో పలు సీసీరోడ్లు, కాల్వల నిర్మాణం చేపట్టాలని గ్రామ సర్పంచ్ గాడి అప్పారావు కోరడంతో వీటికి నిధులు మంజూరు చేస్తామని ధర్మశ్రీ చెప్పారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో చైతన్య, పంచాయతీ డీఈఈ ప్రసాద్, హౌసింగ్ ఏఈ రమణమూర్తి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జోరుగా 'జగనన్నే మా భవిష్యత్తు'



చోడవరం పీఎస్‌పేట సమావేశంలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

చోడవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజారంజక పాలనతో ప్రజలు ఆనందంగా ఉన్నారని ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం పంచాయతీ శివారు పీఎస్‌పేటలో సోమవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై లబ్ధిదారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రజల నుంచి ప్రభుత్వానికి సానుకూలంగా స్పందన రావడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం చోడవరం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో సుమారు కోటికి పైగా కుటుంబాలు వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఎంతో బాగుందని కితాబు ఇచ్చారని చెప్పారు. గత ప్రభుత్వాల పనితీరుకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పనితీరును బేరీజు వేస్తూ ప్రజలకు వివరించామన్నారు. వచ్చే ఎన్నికల్లో మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే విజయం సాధిస్తుందని ధర్మశ్రీ అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందిన నేత

కె.కోటపాడు : సుపరిపాలనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మన్ననలు పొందారని దాలివలస మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి రామునాయుడు అన్నారు. గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లిన ఆయన ఆయా కుటుంబాల అంగీకారంతో మిస్డ్‌కాల్ ఇచ్చి, ఇంటికి, సెల్‌ఫోన్‌కు స్టిక్కర్లు అంటించారు.

వెలుగు పథకం ద్వారా రుణాలు



సిబ్బందితో సమావేశమైన వెలుగు ఏపీఎం లక్ష్మి

నాతవరం: ఈఏడాది 2023-24 ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ లింకేజీ స్త్రీనిధి ఉన్నతి పథకం ద్వారా రూ. 44 కోట్ల 30 లక్షల వెలుగు రుణాలు ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేసామని వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి అన్నారు. సోమవారం సిబ్బందితో సమావేశమయ్యారు. మండలంలో 31 పంచాయతీల్లో 1656 డ్వాక్రా సంఘాలు ఉన్నాయన్నారు. అర్హత ఉన్న గ్రూపు ఒక్కొంటికి రూ. 10 లక్షల చొప్పున ఈ ఏడాది రూ. 36 కోట్ల 50 లక్షలు బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. స్త్రీనిధి ద్వారా 158 మందికి రూ. 60 లక్షలు, ఉన్నతి పథకం ద్వారా 224 గ్రూపుల్లోని 1420 మంది లబ్ధిదారులకు రూ. 7 కోట్ల 10 లక్షల రుణాలు ఇవ్వడానికి చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సీఏలు లక్ష్మి, వాసు, మణిరాజ్, జ్యోతి పాల్గొన్నారు.

పంచాయతీలకు పురస్కారాలు



ప్రశంసాపత్రం అందుకుంటున్న కె.అగ్రహారం సర్పంచ్ అచ్చియ్యమ్మ



ఉత్తమ పురస్కార్ అవార్డు అందుకుంటున్న నాతవరం సర్పంచ్ రాణి

మాడుగుల: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య సాధనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికి సచివాలయాలు, రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలు, యువత కోసం డిజిటల్ లైబ్రరీలు, ప్రజారోగ్యం కోసం విలేజ్ క్లినిక్‌లు, స్వచ్ఛందంగా సేవలందించేందుకు వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. పంచాయతీలపై అవగాహన ఉన్న మంత్రిగా పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన పంచాయతీలకు పురస్కారాలు అందించారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, మంత్రి ఓఎస్‌డీ ఎం. పోలినాయుడు సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ శ్రీనాదు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు సత్కారం

నాతవరం: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలో పది మంది సర్పంచులకు సోమవారం ఉత్తమ పురస్కార్ అవార్డులు ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు అందజేశారు. నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, చెర్లోపాలెం సర్పంచ్ పైల శిరీష, గుమ్మడిగొండ సర్పంచ్ పంచాడ పాప, మాధవనగరం సర్పంచ్ సామల చింతల్లి, యంబీపట్నం సర్పంచ్ కాళ్ల ఝాన్సీరాణి, ఎం.బెన్నవరం సర్పంచ్ మార్తి నాగమణి, శృంగవరం సర్పంచ్ ఉలబాల యర్రయ్యమ్మ, మర్రిపాలెం సర్పంచ్ మంకు రమణమ్మ, వెదురుపల్లి సర్పంచ్ కాళ్ల సర్వస్వతి, గునుపూడి సర్పంచ్ వేముల సూర్యనారాయణమూర్తిలను ఘనంగా సత్కరించి పురస్కార పత్రాలు అందజేశారు. అనంతరం పలువురు సర్పంచులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఈ విధమైన పురస్కార పత్రాలు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. పంచాయతీ విస్తరణాధికారి ప్రేమలీల, కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, సీనియర్ అసిస్టెంటు ప్రసాద్, లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు ఉలబాల శ్రీను పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే గ్రామాల అభివృద్ధి

మాకవరపాలెం: గ్రామాల అభివృద్ధికి ప్రజల సహకారం ఉండాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలస్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన 11 పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఎంపీపీ అవార్డులు, ప్రశంసా పత్రాలుఅందజేశారు. జెడ్పీటీసీ పెట్ల సత్యవేణి, ఎంపీడీవో అరుణశ్రీ, ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జేబీపురం పంచాయతీకి 2 అవార్డులు

చీడికాడ: మండలంలోని పంచాయితీరాజ్ దినోత్సవం సందర్భంగా జేబీపురం పంచాయతీ 2 అవార్డులు దక్కించుకుందని ఎంపీడీవో జయప్రకాష్ తెలిపారు. స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు, నీటి సమృద్ధి అంశాల్లో మొదటి స్థానం కాగా సుపరిపాలన, పేదరికం లేని మెరుగైన జీవనంలో రెండవ స్థానంలో నిలిచాయి. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కురచా జయమ్మ, ఈవోపీఆర్‌డీ కామేశ్వరావు చేతుల మీదుగా అవార్డు అందించారు.

సమైక్యంగా పని చేస్తే పల్లెల ప్రగతి

దేవరాపల్లి: పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత పటిష్ట పరిచేందుకు గ్రామస్థాయిలో పనిచేసే ఉద్యోగులు, ప్రజలు భాగస్వామ్యం కావాలని స్థానిక ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అన్నారు. దేవరాపల్లి సచివాలయం-2లో స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ అధ్యక్షతన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించిననాడే గ్రామాలు అభివృద్ధిబాట పడతాయన్నారు. ఎంపీటీసీ సభ్యుడు మొల్లి కృష్ణమూర్తి, ఎంపీడీవో సీహెచ్ సుబ్బలక్ష్మి, వార్డు మెంబర్లు దీవి శంకర్, కొల్లి ఈశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే బోయిలకింతాడలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు మాట్లాడుతూ పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు అన్నారు. మాజీ సర్పంచ్ ఒమ్మి ఈశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఉప సర్పంచ్ కోన శ్రీను, సెక్రటరీ ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన..

రోలుగుంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయిలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా చట్టాల అమలు, పంచాయతీల అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీడీఓ ప్రభాకరరావు, ఈవోపీఆర్డీవో మల్లికార్జునరావు తదితరులు బీబీ పట్నం, కంచుగుమల, బుచ్చింపేట, కొంతలం, జేపీ అగ్రహారం, జానకిరాంపురం సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవార్డులు అందజేశారు.



జేజీపురం సర్పంచ్‌కు అవార్డు అందిస్తున్న ఎంపీడీవో



దేవరాపల్లి సమావేశంలో మాట్లాడున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం



సందర్శకులను ఆకట్టుకున్న ఎడ్ల పరుగు పందాల పోటీలు

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట, ఎల్‌బీ పురం గ్రామాల ప్రజలు సంయుక్తంగా నిర్వహించిన గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఏడేళ్ల తర్వాత జరుగుతున్న ఈ సంబరాన్ని తిలకించడానికి రెండు గ్రామాల ప్రజలు కుటుంబ సభ్యులతో పాటు పలు జిల్లాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఉదయం నుండి సాయంత్రం వరకు గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి నేలడ్యాన్స్‌లు, తప్పెటగుళ్ల, భారీ మందుగుండు సామగ్రి కాల్చివేత నడుమ అనుపోత్సవం వేడుకగా సాగింది. సాయంత్రం ఎద్దుల పరుగు పందాలను ప్రజలు ఉత్సాహంగా తిలకించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మండల వైసీపీ అధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు తదితరులు పాల్గొనగా.. ఎస్ఐ కుమారస్వామి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీఐ సేవాగుణం



మిలట్రీనగర్ రోడ్డుపై గోతులను పూడ్చుతున్న సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్

రావికమతం: ప్రత్యేక శ్రద్ధతో ఇప్పటికే ఎన్నో రోడ్లపై గుంతల పూడ్చించిన కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ కొత్తకోట మిలట్రీనగర్‌లోని రోడ్డుపై గుంతలను ట్రాక్టర్ లోడ్ క్రషర్ బుగ్గితో సోమవారం కప్పివేయించారు. ఈ క్రమంలో తానే స్వయంగా పారపట్టి పనులు చేయడంతో ప్రజలు సైతం తలోక చేయి వేసి గుంతలన్నింటినీ పూడ్చారు. మిలట్రీనగర్‌లోని ప్రధాన రహదారి ట్రాక్టర్లు ఎక్కువగా తిరగడం వలన పాడైంది. చాలా రోజులుగా అలాగే ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఆ రహదారిపై వెళ్లిన సీఐ మహమ్మద్ ఆ గోతులు పూడ్చాలని నిర్ణయించి సోమవారం స్వయంగా ఆ పని చేసి.. పలువురిచే చేయించి ప్రశంసలు పొందారు.

ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌గా సత్యనారాయణ



సత్యన్నారాయణ

రోలుగుంట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయ ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌గా సీహెచ్ సత్యనారాయణ నియమితులయ్యారు. ఆ శాఖ డ్వామా పీడీ సందీప్ నుంచి అందిన ఉత్తర్వులను సోమవారం ఎంపీడీవో కె.ప్రభాకరరావుకు అందజేసి విధుల్లో చేరారు. ఇప్పటి వరకూ ఇతను ఉమ్మడి జిల్లా పరిషత్ కార్యాలయంలో సైట్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తించేవారు. ఏపీవో కోసూరి సూర్యామణి ఆదేశాలతో సాంకేతిక సహాయకుల సహాయంతో పూర్తిస్థాయిలో విధులు నిర్వహించి శాఖకు మంచిపేరు తీసుకొస్తానని వివరించారు.

ఇళ్ల నిర్మాణాలు సత్వరం చేపట్టాలి



హౌసింగ్ లబ్ధిదారుల సమావేశంలో మట్లాడుతున్న జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ

పాయకరావుపేట : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న ఇళ్ల కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు సత్వరం చేపట్టాలని జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ అన్నారు. ఇంటి నిర్మాణానికి స్థలం మంజూరై, ఇంటి నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయం ఒకటి పరిధిలో గల లబ్ధిదారులతో స్త్రీ శక్తి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ప్లాను ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టి, సొంత ఇంటి కల నేరవేర్చుకోవాలన్నారు. ఇప్పటివరకు మంజూరైన ఇళ్లకు హౌసింగ్ అధికారులు నిర్మాణ సామాగ్రిని సరఫరా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి తిరుమల్లేశ్వరరావు, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి జె.చంద్రశేఖర్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ తూము నాగేశ్వరరావు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని చూసి మద్దతివ్వండి

మాకవరపాలెం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని చూసి వైఎస్సార్‌సీపీకి మద్దతివ్వాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ కోరారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాచపల్లిలో సోమవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాదరణ చూడలేకే టీడీపీ నేతలు ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మండల సచివాలయాల కన్వీనర్ చిటికెల రమణ, సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ బొడ్డు గోవిందరావు, పెట్ల భద్రాచలం, జెడ్పీటీసీ సభ్యురాలు పెట్ల సత్యవేణి, యూత్ అధ్యక్షుడు శ్రీను పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వైఎస్సార్ సీపీ నేతలు మాట్లాడుతుండగా ఇద్దరు టీడీపీ కార్యకర్తలు సమావేశం జరిగే ప్రాంతానికి చేరుకుని రెచ్చగొట్టే మాటలతో గలాటా సృష్టించారు. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో గొడవ సద్దుమణిగింది.

జోరుగా సర్వే రాళ్ల అమరిక పనులు

రోలుగుంట: భూ రీసర్వే పథకం కింద తొలి విడతలో పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లో తహసీల్దార్ వెంకటేశ్వరరావు సరిహద్దులో రాళ్ల పాతే ప్రక్రియ చేపట్టారు. దీనిలో భాగంగా సోమవారం వెదుళ్లవలస రెవెన్యూలో సోమవారం జరుగుతున్న పనులను నర్సీపట్నం ఆర్డీవో జయరాం పర్యవేక్షించారు. 250 మదులకు గాను 200 మదుల్లో ఈ పనులు జరిగినట్టు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మృతి చెందిన రైతు కుటుంబాలకు బీమా అందజేత



మృతుల కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న సన్యాసిరావు

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలం వడ్డాది కోపరేటివ్ సొసైటీలో మృతి చెందిన సభ్యరైతు కుటుంబ సభ్యులకు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి దొండా సన్యాసిరావు నగదు అందించారు. ఇటీవల సొసైటీ పరిధిలో ఉన్న వడ్డాది, కొత్తూరు, చిన అప్పనపాలెం గ్రామాల్లో 10 మంది సభ్య రైతులు మృతి చెందారు. వీరిలో 60 ఏళ్లలోపు వయసు వారికి రూ. 30 వేలు, 60 ఏళ్లు పైబడిన వారికి రూ. 15 వేలు బీమా నగదు మంజూరైంది. పది కుటుంబాల వారికి ముందుగా సోమవారం దహన సంస్కారాలకు ఒక్కో కుటుంబానికి రూ. 4 వేల చొప్పున రూ. 40 వేలు అందించారు. వడ్డాది సొసైటీ రూ. 9 కోట్ల టర్నోవర్‌తో నడుస్తుందని సన్యాసిరావు తెలిపారు. డైరెక్టర్లు కోవెల ఈశ్వరరావు, పాలిమేర కాశి, నాయకులు కుబిరెడ్డి వెంకటరావు, వీర్ల సురేష్, సెక్రటరీ శాంతి తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 22 ఫిర్యాదులు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్‌వీ జయరాం అధికారులను ఆదేశించారు. డివిజన్‌లో 12 మండలాల నుండి 22 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయి. స్పందనలో వచ్చిన ప్రతి ఫిర్యాదుకు అధికారులు జవాబుదారీగా ఉండాలని ఆర్డీవో సూచించారు. సమస్యలపై అర్జీదారుల అభ్యంతరాలను నివృత్తి చేయాలన్నారు. తహసీల్దార్ అన్నాజీరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.